క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న అన్నపూర్ణేశ్వరీ దేవి

ఆదోనిరూరల్: మండలంలోని నెట్టేకల్ గ్రామంలో కొలువుదీరిన గణపతి, కాశీవిశ్వనాథ స్వామి, అన్నపూర్ణేశ్వరి, బసవేశ్వర స్వామి ఆలయాల 12వ వార్షికోత్సవం మంగళవారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గురుపూజ, రుద్రాభిషేకం, హోమం, మహానైవేద్యం, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న విట్టా రమేష్, దివ్యాంగులు

ఆదోనిఅర్బన్: కర్నూలు జిల్లా కేంద్రంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే వికలాంగుల సింహగర్జన మహాసభ కరపత్రాలు, పోస్టర్లను ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ చేతుల మీదుగా దివ్యాంగులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విట్టా రమేష్ మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమం, అభివృద్ధికి ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. వికలాంగుల విషయంపై ప్రభుత్వం ఆలోచించి వారి అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. వికలాంగుల సంక్షేమ సంఘాల జేఏసీ అధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి ఈరన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేష్, నాయకులు రామదాస్, కాంతరాజు, రాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



బి.మానస

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం మల్లికార్జున విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న బి.మానస రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సుగూరప్ప మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో గుంటూరులో జరిగే 33వ రాష్ట్ర సబ్ జూనియర్ పోటీలలో క్రీడాకారిణి మానస పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి

కౌతాళం: ఎన్నికలకు అధికారులందరూ సమాయత్తం కావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ అన్నారు. మంగళవారం మండలంలో మార్పు చేసిన పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. కౌతాళంలోని రెండు పోలింగ్ బూత్‌లతో పాటు ఉరుకుందలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితాలో ఎక్కడా తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా ఉన్నారు.

విజిలెన్స్ తనిఖీలు



కారం మిల్లులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కారం మిల్లుల్లో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎండుమిర్చిని మిల్లులో వేసి కారం పట్టడంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా, లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. కారం పట్టే సమయంలో ఉప్పు, కలర్ వాడుతున్నట్లు అనుమానాలు రావడంతో శాంపిల్స్ తీసుకొని హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. రిపోర్టులు వచ్చిన తరువాత ఆ ప్రకారం చర్యలు చేపడతామన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, సిబ్బంది ఉన్నారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

ఆదోనిఅర్బన్: పెద్దకడబూరు మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన బంగారప్పను పాము కాటువేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గుంటూరుకు పనినిమిత్తం వెళ్లి అక్కడ పని చేస్తుండగా బంగారప్పను పాము కాటు వేసిందన్నారు. ప్రథమ చికిత్స చేయించుకొని స్వగ్రామమైన బసలదొడ్డి గ్రామానికి వచ్చినట్లు చెప్పారు. మళ్లీ మంగళవారం అస్వస్థతకు గురికావడంతో వెంటనే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్య చికిత్సల అనంతరం బంగారప్ప ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మొసలి కన్నీరు కారిస్తే ఓట్లు పడవ్!

- సానుభూతి పొందాలంటే సేవకుడిలా పనిచేయాలి
- టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఫైర్
- మున్సిపల్ క్రీడామైదానంలో వలంటీర్లకు అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోనిటౌన్: మొసలి కన్నీరు కారిస్తేనో, కల్లిబుల్లి మాటలు, అబద్ధాలు చెబితే ఓట్లు పడవు.. సానుభూతి రాదు.. నిత్యం ప్రజల్లో ఉంటూ సేవకుడిలా పనిచేయాలని, అప్పుడే ప్రజా ఆశీస్సులు లభిస్తాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, స్థానిక టీడీపీ నాయకులు మొసలి కన్నీరు కారుస్తూ సానుభూతి పొందాలని చూస్తున్నారని, అది ఎన్నటికీ జరగదని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఇన్‌చార్జి కమిషనర్ చలపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, చైర్‌పర్సన్ బోయ శాంత, కౌన్సిలర్లు, వైస్ చైర్మన్‌లు పాల్గొన్నారు. ముందుగా సేవా వజ్రకు ఎంపికైన మాధవి, షేక్ రేష్మాభాను, సేవారత్నలు ఐదుగురు, సేవామిత్రలు 587 మంది వలంటీర్లకు అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. వలంటీర్లకు పాదాభివందనం చేసినా తప్పులేదని, వయస్సు రీత్యా వలంటీర్లు చిన్నవాళ్లు కావడంతో ఆశీర్వదిస్తున్నానని తెలిపారు. 57 నెలల్లో ఆదోని నియోజకవర్గ ప్రజలకు వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివన్నారు. నవరత్నాల్లో భాగంగా వివిధ సంక్షేమ పథకాలను పేదలకు అందించి వారి ఆదరణ పొందారన్నారు. ఈ రెండు నెలల్లో అంతకన్నా రెట్టింపు సేవలు, సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 14 ఏళ్లు సీఎంగా ఉన్న సమయంలో ఏదైనా చెప్పడానికి, చూపడానికి పథకం, ప్రాజెక్టు ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక పథకాలు, శాశ్వతమైన ప్రాజెక్టులు ఉన్నాయన్నారు.



హాజరైన వలంటీర్లు

ప్రజలకు సేవ చేస్తా



ఐదేళ్లుగా వలంటీర్‌గా పనిచేస్తున్నాను. సేవ చేయడంలో ఆత్మసంతృప్తి లభిస్తోంది. తనకు కేటాయించిన ఏరియాలో ప్రజల్లో మమేకమై సేవలందించా. మా సేవలను ప్రభుత్వం గుర్తించి సత్కరించడం చాలా సంతోషంగా ఉంది.

-పి.సంధ్యారాణి, 3వ వార్డు వలంటీర్

చాలా సంతోషంగా ఉంది



వలంటీర్ అంటే మొదట్లో చాలా భయంగా ఉండేది. మాకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించాం. జగనన్న ఆశయాన్ని నెరవేర్చాం. ఎవరినోట విన్నా వలంటీర్ అనే మాటే వినబడుతోంది. ఇంత గొప్ప వ్యవస్థలో సేవలందించినందుకు గర్వపడుతున్నా.

- తాయమ్మ, 4వ వార్డు వలంటీర్

వలంటీర్ సేవలు అమోఘం



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కోసిగి: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేరవేస్తున్న వలంటీర్ల సేవలు అమోఘమని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ మాధవరెడ్డితో కలిసి ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ అవ్వతాతలకు ఇంటి తలుపు తట్టి పింఛన్ అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతోందన్నారు. గత చంద్రబాబు పరిపాలనలో అవ్వాతాత పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అవస్థలు పడే పరిస్థితి ఉండేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో వారి అనుకూలమైన వారికే లబ్ధి చేకూర్చేవారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని చెప్పారు. పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ అయ్యమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, షౌకత్ ఆలి, దొడ్డి నరసన్న, నరసింహులు గౌడ, కాల్వ లక్ష్మయ్య, బండ్ల గోవిందు పాల్గొన్నారు.

మూడు గడ్డివాములు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దకడబూరు: మూడు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతులు చిన్న హనుమంతు, గుంటెప్ప వివరాల మేరకు.. చిన్న హనుమంతు 4ఎకరాల గడ్డిని రూ. 60 వేలతో కొనుగోలు చేశాడు. అదేవిధంగా గుంటెప్ప రెండు ఎకరాల గడ్డిని రూ. 30 వేలతో కొనుగోలు చేసి నివాసం ఉంటున్న సమీపంలోనే వాములు వేసుకున్నారు. ఉదయం పొలానికి వెళ్లిన తరువాత ఎవరో ఆకతాయిలు గడ్డివాములకు నిప్పు పెట్టినట్లు వాపోయారు. చుట్టుపక్కవారు గమనించి బాధితులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం చేరవేశారు. బాధితులు, ఇరుగుపొరుగు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేలోగా పూర్తిగా కాలిపోయాయి. మూగజీవాల కోసం తెచ్చిన గడ్డిని అన్యాయంగా కాల్చడం ఏమిటని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు.

'ఉజ్వల్ పథకంతో ప్రయోజనం శూన్యం'

ఆదోని సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల్ యోజన పథకం ద్వారా ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేదని ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నీలకంఠప్ప విమర్శించారు. ఆయన మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. నిరుపేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్, స్టవ్, రెగ్యులేటర్ అందించాల్సిన ఈ పథకాన్ని బీజేపీ నీరుగారుస్తోందన్నారు. గ్యాస్ ఏజెన్సీలు ఒక్కొక్క కనెక్షన్‌కు రూ.600 నుంచి రూ.700 వరకు వసులు చేస్తున్నారన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వాల్సిన సిలిండర్‌ను ఇలా డబ్బులకు అమ్ముకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి డబ్బులు వసులు చేస్తున్న ఏజెన్సీలను రద్దుచేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ పార్టీ నాయకులు మారుతీరావు, సాయినాథ్, సుంకన్న, రామన్న యాదవ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన సిద్ధేశ్వర స్వామి జాతర



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హొళగుంద: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాలతో పాటు మండల ప్రజల ఆరాధ్య దేవుడు సిద్ధేశ్వర స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం వసంతోత్సవ కార్యక్రమాల నంతరం వైభవంగా ముగిశాయి. 14న కంకణ ధారణతో ఉత్సవాలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. 18న రథోత్సవం వైభవంగా జరగ్గా, 19న లంకాదహనం కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం వసంతోత్సవంలో భాగంగా ఆలయంలో సిద్ధేశ్వరునికి ఆకుపూజ, మహామంగళారతి, అభిషేకాలు, తదితర పూజలు చేపట్టారు. రాత్రి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగింపుగా ఆలయ పూజారుల ఇంటికి చేర్చడంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరం



దివ్యాంగ అన్నదమ్ములకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: పేదల సంక్షేమం కోసం పాటుపడే పార్టీ వైఎస్సార్‌సీపీ అని సీనియర్ నాయకుడు వీరసేన రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కామవరం గ్రామానికి చెందిన దివ్యాంగ అన్నదమ్ములు ఇర్ఫాన్, ఇమ్రాన్‌లకు సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆయన మంగళవారం వారికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన గాజుల దస్తగిరి, శేకన్‌బీ దంపతుల ఇద్దరు కుమారులు ఇర్ఫాన్, ఇమ్రాన్‌లకు పుట్టుకతోనే కాళ్లు, చేతులు అచేతనస్థితిలో ఉండడంతో మంచానికే పరిమితమయ్యారు. వారి చికిత్స కోసం ఉన్న ఆస్తి మొత్తం ఖర్చుచేసినా పరిస్థితి మెరుగుపడలేదు. వారి పరిస్థితిని గ్రామ యువ నాయకుడు మహేందర్ రెడ్డి గత అక్టోబర్‌లో ఎమ్మిగనూరుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి బాధిత అన్నదమ్ములకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాయం మంజూరు చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను మంగళవారం వీరసేనా రెడ్డి చేతుల మీదుగా ఇర్ఫాన్, ఇమ్రాన్‌ల తల్లిదండ్రులకు అందజేశారు. ఆ డబ్బు తమ కుమారుల చికిత్సకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

23న బండలాగుడు పోటీలు

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో ఆంజనేయస్వామి, కింది శివాలయం, వీరభద్రస్వామి, కాజాపురం సుంకులా పరమేశ్వరి ఆలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్టాపన సందర్భంగా అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలను ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి కింద రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు చొప్పున అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 22వ తేదీలోపు ఎంట్రీఫీజు రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు 90003 69779 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బైక్ అదుపుతప్పి అక్కాతమ్ముడికి గాయాలు



గాయపడిన రఘును అంబులెన్స్‌లో ఎక్కించే ప్రయత్నంలో సిబ్బంది

వెల్దుర్తి(కృష్ణగిరి): కల్లూరు మండల పరిధిలోని ఉలిందకొండ హైవేపై మంగళవారం బైక్ అదుపుతప్పి కిందపడడంతో వెల్దుర్తికి చెందిన అక్కాతమ్ముడు వీణ, రఘు గాయపడ్డారు. వీణ వెల్దుర్తి మండల పరిధిలోని సూదేపల్లె (మదార్‌పురం) సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తోంది. ఆమె పరిధిలో ఓ గర్భిణికి హైరిస్క్‌తో ఉండడంతో కర్నూలు సమీపంలోని కోడుమూరు రోడ్డు పెంచికలపాడు ఆసుపత్రిలో చికిత్సకు పంపారు. గర్భిణి పరిస్థితి తెలుసుకునేందుకు ఏఎన్‌ఎం వీణ కర్నూలుకు తన తమ్ముడు రఘుతో కలిసి బైక్‌పై బయలుదేరింది. మార్గం మధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో రఘుకు తీవ్ర గాయాలు కాగా వీణకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైభవంగా రంగస్వామి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో రంగస్వామి మహారథోత్సవం మంగళవారం సాయంత్రం కనులపండుగగా జరిగింది. ఉదయం నుంచి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తిని రథంపై ఉంచి రెడ్డిమాన్ ఇంటి నుంచి పూర్ణకుంభం తీసుకువచ్చి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశేష భక్తుల మధ్య స్వామి వారి రథం ముందుకు కదలి గ్రామ వీధుల్లోకి వెళ్లింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఆదోనిటౌన్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరుచేసి పక్కా ఇళ్లు నిర్మించేందుకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 3వ వార్డు శక్తిగుడి, గణేష్ సర్కిల్ ఏరియాలకు చెందిన 27 మంది పేద మహిళలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2006–07లో ఇంటి స్థలం కోసం రూ.2100 డీడీ కట్టిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం ఇస్తామని మాట ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతిఒక్కరికీ స్థలాలను చూపుతున్నామన్నారు. ఇంటి పట్టాలు పొందిన మహిళలు ఏ ఒక్కరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన లక్ష్యంగా పనిచేస్తున్నారని వివరించారు. వార్డు కౌన్సిలర్ మహేశ్వరి ఆనంద్, సన్నీ, తిమ్మప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: అలాగే ఎమ్మెల్యే స్వగృహంలో 13వ వార్డుకు చెందిన 12 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సొంతిల్లు లేని ప్రతిఒక్కరికీ ఇంటి పట్టాలను అందిస్తామని స్పష్టం చేశారు. వార్డు కౌన్సిలర్ వై.పి.పద్మావతి, ఇన్‌చార్జ్ వై.పి.కృష్ణమోహన్(కిట్టు), వైఎస్సార్‌సీపీ నాయకులు బజారి శీను, వై.పి.శేఖర్, చంద్ర, కిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన వీరాచారి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలులోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రూ.1.30 లక్షలు ఖర్చు పెట్టుకున్నారు. జబ్బు నయం గాకపోవడంతో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు రూ.80 వేలు చెక్కు మంజూరయ్యింది. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బాధితుడు వీరాచారికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో దేవాలయాల అభివృద్ధి



ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కోసిగి: గ్రామీణ ప్రాంతాల్లో పురాతన దేవాలయాలు అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కందుకూరు, కామన్‌దొడ్డి, ఆర్లబండ గ్రామాల్లో టీటీడీ సీజీఎఫ్ నిధులతో దేవాలయాల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీటీడీ సీజీఎఫ్ నిధులు కింద కందుకూరు గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయానికి రూ.73 లక్షలు, కామన్‌దొడ్డి ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.40లక్షలు, ఆర్లబండ గ్రామంలో రామలింగేశ్వర స్వామి దేవాలయానికి రూ.40లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇది వరకే నియోజకవర్గంలో 31 దేవాలయాలకు రూ.10లక్షల చొప్పున కేటాయించి అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి, బెట్టన గౌడ, కామన్‌దొడ్డి నరసింహులుగౌడ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి దేవర

మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో కురువ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీబీరలింగేశ్వరస్వామి దేవర ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేకువజాము నుంచి అభిషేకాలు, వెండి కవచ అలంకరణ, ఆకు పూజ, మహామంగళ హారతి తదితర పూజలు చేశారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు.

డిగ్రీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న టెక్ మార్క్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్

ఆదోని సెంట్రల్: డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక ఇంటర్న్‌షిప్ తరగతులు నిర్వహిస్తామని టెక్ మార్క్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం వివిధ సంస్థలు, వృత్తులపై శిక్షణ ఇప్పించేలా తగు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులకు స్కిల్స్ నేర్పించడమే గాకుండా ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కరెస్పాండెంట్ దైవాదీనం రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు కంప్యూటర్, ఎలక్ట్రానిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

కోసిగి: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం వచ్చాక గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని ఎంపీపీ ఈరన్న అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాధవరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. గ్రామంలోనే రైతు భరోసా, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయించినట్లు పంచాయతీ రాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ భవనాల నిర్మాణలు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయా శాఖల పనితీరు గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యమ్మ, కోఆప్షన్ మెంబర్ షౌకత్ ఆలి, ఈఓ చంద్రశేఖర్, ఎంఈఓ నాగేశప్ప పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకుల పరిశీలన



ఫిల్టర్ బెడ్లను పరిశీలిస్తున్న అధికారులు


గోనెగండ్ల: మండల కేంద్రంలోని ఎస్ఎస్ ట్యాంక్, అలువాల ఎస్ఎస్ ట్యాంకులను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు సాంబయ్య, శివకుమార్‌లు పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు ఎన్ని మోటర్లు ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్, సరఫరా ఎలా ఉంది. నీటి పథకాలకు విద్యుత్ సరఫరా అవుతుందా లేదా అని పరిశీలించారు. అలాగే ట్యాంకుల్లో నీటి స్టోరేజ్ ఎంత ఉంది. వచ్చే వేసవికి నీరు సరిపోతాయా లేదా, ఫిల్టర్‌బెడ్లు, మోటార్లు పని చేస్తున్నాయా లేదా అని ఏఈ శ్రీనివాస రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని ట్యాంకులను పరిశీలించి అక్కడి సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు వారు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఏఈ శ్రీనివాస రెడ్డి సూచించారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నహరివాణం గ్రామానికి చెందిన అన్నమయ్య అనే వ్యక్తి ఇంటి వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇస్పీ ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. అన్నమయ్య కర్ణాటక నుంచి మూడు బాక్సుల మద్యాన్ని తీసుకొచ్చి ఇంట్లో నిల్వ ఉంచి విక్రయిస్తుండగా సమాచారం రావడంతో దాడులు జరిపి పట్టుకున్నట్లు చెప్పారు. మద్యాన్ని స్వాధీనం చేసకుని, కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు.

వాహనాల వేలం

పత్తికొండ రూరల్: మద్యం అక్రమ రవాణా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం పత్తికొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం ఆవరణలో సీఐ సువర్ణలత ఆధ్వర్యంలో వేలం వేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో 12 వాహనాలను వేలం వేయగా రూ.99 వేలకు పాట దారులు దక్కించుకున్నట్లు సీఐ తెలిపారు.



పత్తికొండలో వాహనాల వేలం పాట నిర్వహిస్తున్న సెబ్ అధికారులు